# దత్తపుత్రుడు

ఐదేళ్ళ వాడప్పుడు ప్రసాదరావును తెచ్చి పెంచుకున్నది సుబ్బమ్మగారు. వాడికి లక్ష్మీనారాయణశాస్త్రి అని తన భర్త గారి పేరే పెట్టించుకుని, ఆ పేరు పెట్టి పిలిచే యోగ్యత తనకు లేదు గనక 'ప్రసాదం' అనే పిలిచేది.

తన దత్తత నిశ్చయమైన కొత్తలో ప్రసాదం (లేక శాస్త్రి) తనకేదో జరగబోతున్నదని మాత్రమే తెలుసుకోగలిగాడు గాని, అది ఏమిటో గ్రహించలేక పోయినాడు. తనకు నిజంగా ఏదైనా విపత్తే జరగబోతుంటే ఎవరో ఒకరు తనకోసం ఆదుర్దాపడరా? ఏ విపత్తు లేకపోతే, తన తల్లి మొహం ముడుచుకొని సహం కావటానికి కారణం ఏమిటి? ... ఆ రాత్రి ఒక రాత్రివేళ ఆవిడ తన పక్కలో వచ్చి ఎందుకు పడుకున్నది? తన మొహం ఎందుకు అన్నిసార్లు ముద్దుపెట్టుకొన్నది? ఆవిడ మొహం తన మొహానికి తడిగా ఎందుకు తగిలింది?

తన తల్లి చేసిన ఆ పనికి ఆ అర్భకుడికి ఆనందం కలిగే అవకాశం కూడా ఎక్కడ? ఒక వేపునించి అర్థంకాని భయం అవతరించుకొచ్చిందేగాని!

ఆ తరవాత, వెంటనే కొద్ది రోజుల్లో దత్తత చేసేశారు. తనకు కొత్త తల్లి వచ్చింది. ఆవిడకు జుట్టులేదు, బొట్టులేదు. ఇకముందు ఆవిడ తనకు అమ్మ! వెధవముండ అయిన అమ్మను ప్రసాదం ఊహించుకోలేకపోయినాడు. వాడికది చెప్పరానంత అశుభంగా తోచింది.

దత్తత జరుగుతుంటే వాడు ఎవరికేసీ చూడలేకపోయినాడు. అవమానమూ, రోషమూ, దుఃఖమూ, నిరాశా, ఇంకేమేమిటో వాడి చిన్న హృదయాన్ని మథించేస్తున్నై. వాడి కళ్ళు మంత్రాలు చదివే బ్రాహ్మణ్ణి గురించి ఆత్రంగా అనవసరమైన వివరాలన్నీ గమనిస్తున్నై. ఆయన పెదిమలు ఎట్లా కదిలేదీ, ఆయన మెడమీది చర్మమూ పీకా ఎట్లా పైకి కిందికీ ఆడుతున్నదీ, మంత్రాలు చదవటంలో గుక్క తీసుకునేటప్పుడు ఆయన కనుబొమ్మలు ఏవిధంగా పైకెత్తేదీ గమనిస్తున్నాడు. తన వెనక, సమీపంలోనే కూర్చున్న తన అమ్మ – ఆ వెధవముండ గుండు ముసుగుకాదు – 'అమ్మ' మొహం ఎట్లావున్నదీ, చూడకుండానే వాడికి కనిపిస్తున్నది.

దత్తత అయిపోగానే 'అమ్మ' కంటనీరు పెట్టుకున్నది. తనక్కూడా బావురుమని ఏడుపొచ్చింది. ప్రసాదం ఏడిచాడు.

"పిల్లవాణ్ణి కాస్సేపు అట్లా దొడ్లోకి తీసుకుపోయి సముదాయించవమ్మా" అని ఒక మగగొంతు – నలభై ఏళ్ళ నెరసినగడ్డం గొంతు – కేక పెట్టింది.

"నాన్నగారూ! ఏడవకు. అట్లా ఏడుస్తారా ఎక్కడన్నా?" అన్నది అమ్మ.

"మరి నువ్వేడవలేదుటే?" అన్నాడు ప్రసాదం.

"మిగిలిన నలుగురు పిల్లలు లేందీ, నువ్వు నన్ను 'ఏమే' అని పిలవటం కూడా ఎందుకు నేర్చుకున్నావురా నాన్నా? నీ మాటలు జ్ఞాపకం వస్తే నేనేమయేదిరా?" అని ఆవిడ మళ్ళీ రోదనం మొదలుపెట్టింది. ప్రసాదానికీ ఏడుపొచ్చింది.

ఇంతలో ముంచుకుపోయినట్లుగా వచ్చింది ఆ ముసుగు గుండు వెధవ ముండ – "పిల్లవాడేస్తున్నాడుటమ్మా? పాపం... " అంటూ.

దూరాన్నించి ఒక గర్జన వినబడింది – "వ్వాసే, సుబ్బ...మ్మా" గడ్డం నెరిసిన నలభై ఏళ్ళ గొంతు.

"ఓ ఓ ఓయ్!" అన్నది ముసుగు వెధవముండ గుండు.

"న్ వ్ ట్ రా!" – నెరసిన విభూది నలభై ఏళ్ళ రుద్రాక్షలు, బలవంతాన గుండు రుద్రాక్షల మాట ప్రకారం నడుచుకుంటూ వెళ్ళింది.

"అమ్మా, నాకు వాళ్ళ ఆస్తి ఒద్దే!" అన్నాడు ప్రసాదం ఏడుపుగొంతుతో. తల్లి సమాధానం కోసం ఊపిరి బిగబట్టి చెవులు రిక్కించిన దేవతల కేమీ వినిపించలేదు.

* * * * *

"అబ్బాయి, ప్రసాదం!... ఇక్కడ వుండే పలకవేంరా నాయనా?"

"ఎందుకేం?"

"అన్నం తినవుట్రా?"

"నా కాకల్లేదు పో!"

"నన్నెందుకురా, నాయనా, ఇట్లా ఏడిపిస్తావ్?"

"నువు మా అమ్మ నేడిపించలేదేం? ఆవిడకన్న నువ్వెక్కువేడుస్తున్నావా?"

"హయ్యో తండ్రీ! ఏడవదూ, పాపం! కన్నకడుపుకాదూ? నిన్నెప్పుడు పెంపుడివ్వటానికి వొప్పుకుందో అప్పుడే ఆవిడ కడుపుకోసుకుంది."

"నువు పెంపుడడిగితే ఇచ్చింది. లేకపోతే ఇస్తుందా ఏమిటి?"

"అడిగితే మాత్రం ఇస్తారుట్రా నాయనా! ఇంకా ఇద్దరు కొడుకులూ, ఓ కూతురూ ఉన్నారు గనక ఇచ్చింది. లేకపోతే ఇస్తుందా?"

"మరి నా కోసం ఏడవటం మానేసిందా?"

"మానకుండా వుందా ఏమిటి? ఏడిచి ఏడిచి మానేసుంటుంది."

"మా అమ్మ నా కోసం రోజూ ఏడుస్తుంది."

"నేను మాత్రం మీ అమ్మను కాదుట్రా నాయనా!"

"నువు మా అమ్మ వెందుకవుతావేమిటి? మా అమ్మను నేను 'ఏమే' అనే వాణ్ని. అందుకని నా కోసం ఏడుస్తుంది."

"నన్ను కూడా 'ఏమే' అనరా!"

"మా అమ్మ నా దగ్గర పడుకుని ముద్దు పెట్టుకునేది."

"మరీ, నే ముద్దు పెట్టుకోబోతే తోసేస్తావెందుకురా నాయనా?"

"నువ్వా! నీ దగ్గర వెధవముండ వాసన! నువ్వేమన్నా మా అమ్మవా ఏమిటి, నన్ను ముద్దు పెట్టుకోటానికి!"

"నేను మీ అమ్మల్లే ఏడవటంలా? చూడూ!"

"అన్నీ దొంగ ఏడుపులు!.. నాతో అవీ ఇవీ చెప్తూతూ కూర్చుని అన్నం పెట్టవేం?"

"ఇదిగో ఒక్క క్షణం!"

"నాకు పెరుగ్గావాలి, ఉందా?"

"అయ్యో! నీకు పెరుగులేకుండా చేస్తానుట్రా?"

"నిన్ను 'అమ్మా' అని పిలవటానికి లంచమేం?"

"నీ కిష్టంలేకపోతే పిలువకమ్మా! 'అమ్మా' అని పిలువకపోయినా పెరుగేస్తాగా! నీకు కాకుండా నేనింకెవరికి పెట్టుకుంటాను చెప్పు."

"మా అమ్మను చూడాలి. మా అమ్మ దగ్గిర పడుకోవాలి. మా అమ్మ నన్ను ముద్దుపెట్టుకోవాలి. నా కన్నం పెట్టాలి. మా అమ్మ నాకు నీళ్ళు పొయ్యాలి. మా అమ్మను రమ్మను. లేకపోతే నేను బడికిపోను, అన్నం తినను. నీళ్ళు పోసుకోను, ఏమీ చెయ్యను."

"మీ అమ్మ, పాపం, ఇక్కడికివచ్చి కూచోమంటే కూచోగలదా? నువ్వే వెళుదువుగాని."

"అన్నీ వొట్టిదే! నువు పంపిస్తావా నిజంగా?"

"పంపించకపోతే అప్పుడను."

"చూద్దాంగా?"

* * * * *

తన తల్లి కనపడగానే ప్రసాదం తల్లికేసి చేతులుచాచి "నేనొచ్చానే అమ్మా!" అన్నాడు. తల్లి పెద్ద కేకవేసి కొడుకుని ఆలింగనం చేసి, మొహమంతా నిమిరి, "ఒచ్చావుట్రా నాన్నా? నా చిట్టితండ్రే! నా బంగారుతండ్రే! మా నాయనే! మా వరహాలే!" అని ప్రేమ కురిపించసాగింది.

"నన్ను పంపించకపోతే అన్నం తిననన్నానే! బడికి పోనన్నానే! నీళ్ళు పోసుకోనన్నానే!"

తల్లి ముక్కుమీద వేలుపెట్టుకొని గుడ్లుతేలవేసి కొడుక్కేసి చూస్తూ "అయ్యయ్యో! అట్లా అనొచ్చునట్రా, పిచ్చి వెధవా" అన్నది.

"ఏమే!" అన్నాడు ప్రసాదం, నిర్లక్ష్యంగా తల ఆడిస్తూ.

"ఆవిడ ఏమన్నా అనుకోదూ?"

"ఏ మనుకుంటే?" ఇంకా నిర్లక్ష్యంగా.

"ఆవిడక్కోపం రాదుట్రా? పైకట్లా అనొచ్చా?"

"ఆ వెధవ ముండ క్కోపం వస్తే నాకు భయమా ఏమిటి?" అన్నాడు ప్రసాదం తన తల్లి బెదురు కాశ్చర్యపడుతూ.

తన కొడుకు ప్రయోజకత్వానికి కలిగిన ఆనందాన్ని లోపలే అణుచుకోవటానికి ఆడది చెయ్యగలిగినంత ప్రయత్నం చేస్తూ, నోటిమీద చెయ్యి కొట్టుకొంటూ "అవ్వ! అవ్వ! అట్లా అనొచ్చుట్రా? ఆవిడకు తెలిస్తే ఏమంటుందీ?" అన్నది.

"ఏమంటుందేం? నేను రోజూ ఆవిణ్ణి అంటంలా?"

"ఏమనీ?"

"వెధవముండా అని."

తల్లి కొడుకు వంక సోద్దెంగా చూస్తూ, "ఆ మాటంటే ఊరుకుంటుందీ?" అన్నది.

"ఎందుకూరుకోదూ?"

"నువ్వట్లా అన్నా, నిన్ను అపేక్షగా చూస్తుందిట్రా?" అన్నది తల్లి

"పెరుగేసి పెడుతుంది."

❀ ❀ ❀ ❀ ❀

రాత్రివేళ భోంచేసి ప్రసాదం పడుకున్నాడు. ఇక్కడి మంచాలూ పక్కలూ అక్కడంత బాగాలేవు. లేకపోతే ఏం? ఇది అమ్మవేసిన పక్క. ఇవాళ మళ్ళీ ఒక రాత్రివేళ అమ్మవచ్చి తనపక్కలో పడుకుని అదివరకల్లేనే ముద్దు పెట్టుకుంటుంది. కాని ఏడవదు. ఇంకెందుకేడవడం? తన పెంపుడయి పోయిందిగా!.. అమ్మ వచ్చి తన దగ్గిర పడుకునేదాకా తను మేలుకునే ఉండాలి.... తను వచ్చిన సంతోషం పొద్దున అమ్మ ఎంత బాగా కనపరిచింది. మళ్ళా రోజల్లా కనబరచలేదు. కాని, లోపల ఉంటుంది!

అమ్మా, నాన్నా జాముసేపటినించి మాట్లాడుకుంటున్నారు. తనకేమీ అర్థం కాదు. వాళ్ళు మాట్లాడేది తన్ను గురించే.

"ఆవిడకి వాడంటే చాలా అపేక్షగా ఉన్నట్టుంది. అదీ కొంత నయమే! వాణ్ణి మనిష్టం వచ్చినప్పుడల్లా తెచ్చుకోవచ్చు... ఆవిణ్ని కొంత డబ్బేమయినా అడుగుతారా ఏమిటి?" అంటున్నది అమ్మ.

"ఏదో చూద్దాంలే" అని విసుక్కుంటున్నాడు నాన్న.

❁ ❁ ❁ ❁ ❁

నెలరోజులయినా సుబ్బమ్మ కుర్రవాడికోసం కబురు చేయదు. పది రోజుల నించీ ప్రసాదం తల్లి దండ్రుల ఆదుర్దా హెచ్చుతున్నది.

ఆవిడ పిల్లాణ్ణి విడిచిపెట్టేసి, ఇంకోణ్ని పెంచుకుంటుందేమో!

వీడు ఆవిడకేం కోపం తెప్పించాడో ఏం ఖర్మమో!

కాకపోయినా, ఆవిడ మీద ఈ వెధవ కింత అలుసెట్లా వచ్చిందో! ఎవర్నీ తొందరపడి ఏ మాటా అనేవాడు కాడే!...

చాటుగా అమ్మ అబ్బాయిని కసిరింది - "నువ్వావిణ్ని ఏమన్నావురా వెధవా?"

"వెధవముండా అన్నాను"

"ఎన్నిసార్లన్నావు?"

"ఏమో! చాలాసార్లన్నాను. ప్రతిరోజూ అన్నాను. ఆవిడ వెధవముండ కాదా ఏమిటి? ఆవిడ దగ్గిర వెధవముండ వాసన కూడానూ!"

తనని గద్దించే తల్లినీ, అదివరకు ఆనాడు తనని దొడ్లోకి తీసుకువచ్చి ఏడ్చిన తల్లినీ ఒకతెగా భావించలేక పోయినాడు ప్రసాదం. ఆడదాని అఘాయిత్యం వాడికేం తెలుసు! ఆనాడు తనని ఏడిపించడమే ఆవిడ ఆశయం అని వాడే మెరుగునూ?

❁ ❁ ❁ ❁ ❁

"మావాడు వట్టి వదరుబోతు. వాడు అందర్నీ తిట్టటం కూడా నేర్చుకున్నాడు" అన్నాడు అబ్బాయి జనక తండ్రి.

"అందర్నీ ఎందుకు తిడతాడు పాపం? నన్నే తిడతాడు. వాడిచేత తిట్టించుకోవటం నాకు ముద్దే! నేను వాడికా అలుసిచ్చాను" అన్నది సుబ్బమ్మగారు.

జనక తండ్రి అతిదీర్ఘ నిశ్వాసం విడిచాడు. అంతగాలీ ఆయనలో ఉండి రకరకాల హృదయ మనోవికారాలు కలిగిస్తూ ఉండింది. ఆ విషవాయువు బయటికి పోగానే ఆయన మొహంలో కొత్తకళ వచ్చింది.

"వాడు తల్లి కోసం, పాపం కలవరించసాగాడు. అందుకని పంపించాను. వాడి సుఖమే నాక్కావలిసింది" అన్నది సుబ్బమ్మకూడా నిట్టూర్చి.

"బాగుందే! ఇక మీరే వాడి తల్లీ! మీరు వాణ్ణి కాస్త భయపెట్టండి, లేకపోతే చెడతాడు!"

❀ ❀ ❀ ❀ ❀

"ప్రసాదం?"

"ఏవమ్మా?"

"పడుకోవుట్రా, నాయనా!"

"పడుకుంటాన్లేవే."

"నా పిచ్చి తండ్రిగదే. నన్నే వే అన్నావుటే! ఏదీ ఒక ముద్దుపెట్టు! ఆరి దొంగముండా, నీ ముద్దెంత కమ్మగా ఉందిరా!... నా దగ్గిర వెధవముండ వాసనెయ్యటం లేదమ్మా!"

ప్రసాదం బిక్కమొహం వేశాడు.

"నా తండ్రీ, లేదులేరా!" అని సుబ్బమ్మ కుర్రవాణ్ణి తన రొమ్మున అదుముకున్నది.

***మొదటి ముద్రణ : భారతి, ఆగస్ట్ 1938***